నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
11 | హైదరాబాద్, సోమవారం 25 మార్చి 2024 | SANGAREDDY

హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

అందరి జీవితాలు రంగులమయం కావాలి

- హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 24: చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ కలిసి నిర్వహించుకునే పండుగ హోలీ అందరి జీవితాల్లో రంగులు నింపాలని ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కేసీఆర్ నాయకత్వంలో పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని, అన్నివర్గాల ప్రజలు వారి పండుగలను సుఖ సంతోషాలతో జరుపుకొంటున్నారని తెలిపారు. చిన్నపిల్లలకు హోలీ రంగులు కళ్లల్లో పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఈ పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రసాయనాలతో కూడిన హానికరమైన రంగులతో కాకుండా సాధారణమైన రంగులు, నీటితోనే హోలీ పండుగను జరుపుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

దత్తగిరి మహరాజ్ పాదయాత్ర, పల్లకీ సేవలో స్వాములు, భక్తులు

వైభవంగా దత్తగిరి మహరాజ్ పల్లకీసేవ

న్యాల్‌కల్, మార్చి 24: దత్తగిరి మహరాజ్ 45వ వార్షిక అమర తిథిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల మీదుగా వస్తున్న దత్తగిరి మహరాజ్ పాదయాత్ర-పల్లకీ సేవకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం మండలంలోని మిర్జాపూర్(ఎన్) గ్రామంలోకి చేరుకున్న దత్తగిరి మహరాజ్ పాదయాత్ర-పల్లకీసేవకు భక్తులు భజాభజంత్రీలు, భజన కీర్తనల మధ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో దత్తగిరి మహరాజ్ విగ్రహానికి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని ముంగి చౌరస్తా మీదుగా ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమానికి చేరుకుంది. స్థానిక ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుక్మాపూర్ మీదుగా మండలంలోని హద్నూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమానికి పాదయాత్ర-పల్లకీ సేవ చేరుకుంది. ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఝరాసంగం మండలంలోని బర్ధీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతిపతులు అవదూత గిరి మహరాజ్, డాక్టర్ సిద్దేశ్వరానంద గిరి మహరాజ్, న్యామతాబాద్ ఆశ్రమ పీఠాధిపతి విశ్వగిరి మహరాజ్, ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ భక్తులకు ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కారు..జోరు

పార్లమెంట్ అభ్యర్థుల ప్రకటనతో దూకుడు పెంచిన బీఆర్ఎస్

- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ సమావేశాల నిర్వహణకు నిర్ణయం
- మెదక్, జహీరాబాద్ స్థానాల గెలుపుపై ప్రత్యేక దృష్టిపెట్టిన హరీశ్‌రావు
- ఇంకా ఖరారు కాని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు
- అధికార పార్టీలో గ్రూపులతో ఎటూతేల్చని కాంగ్రెస్ అధిష్టానం
- బీజేపీ అభ్యర్థులపై ద్వితీయ శ్రేణి నాయకుల అసంతృప్తి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో బలంగా బీఆర్ఎస్

పి.వెంకట్రామిరెడ్డి
మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి

గాలి అనిల్ కుమార్
జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి

క్యామ మల్లేశ్
భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి

బోయినిపల్లి వినోద్ కుమార్
కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి

సిద్దిపేట, మార్చి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో బీఆర్ఎస్‌లో జోష్ నెలకొంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెండు సిట్టింగ్ స్థానాలను గెలిపించుకోవడంతో పాటు ఇతర పార్లమెంట్ స్థానాల గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ సిద్ధం చేసింది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పార్టీ అభ్యర్థుల గెలుపునకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాకపోయినా, ఉమ్మడి మెదక్ జిల్లాలో మెజార్టీ స్థానాలను గెలుచుకొని బీఆర్ఎస్ సత్తా చాటింది. పది శాసనసభ స్థానాలకు ఏడుచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచారు. అదే ఉత్సాహంతో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ సిట్టింగ్ స్థానాలను గెలిచి సత్తాచాటేందుకు బీఆర్ఎస్ దూకుడు పెంచింది. మెదక్ ఎంపీ స్థానం నుంచి మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్ స్థానం నుంచి గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థులుగా బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించింది. సిద్దిపేట జిల్లాలో విస్తరించి ఉన్న కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, భువనగిరి స్థానం నుంచి క్యామ మల్లేశ్‌ను పార్టీ అభ్యర్థులుగా కేసీఆర్ ప్రకటించారు. గట్టి పోటీనిచ్చే అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ స్థానంలోని అసెంబ్లీ స్థానాల్లో 26వ తేదీ నుంచి ఈనెల 30 వరకు సమావేశాలు నిర్వహించనున్నది. ఈ సమావేశాల్లో క్యాడర్‌కు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దిశానిర్దేశం చేస్తారు. ఇదే తరహాలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని శాసనసభ స్థానాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేస్తారు. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది శాసనసభ స్థానాల్లో పార్టీ సమావేశాలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత, పార్లమెంట్ అభ్యర్థుల ప్రకటన అనంతరం మరోసారి పార్టీ సమావేశాలు నిర్వహించి అన్ని స్థానాలు కైవసం చేసుకోవడానికి వ్యూహం రచిస్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అందరినీ కలుస్తున్నారు. అందరికన్నా ముందుగా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా వినోద్‌కుమార్‌ను ప్రకటించడంతో ఆయన అన్ని మండలాలను తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను పార్టీ ప్రకటించడంతో త్వరలోనే ఇక్కడ పార్టీ కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. అన్ని స్థానాల్లో కేసీఆర్ భారీ బహిరంగ సభలు నిర్వహించేలా రూట్‌మ్యాప్ రెడీ చేస్తున్నారు. అన్ని మండల కేంద్రాలతో పాటు పెద్ద గ్రామాల్లో రోడ్ షోలు నిర్వహించి సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

ఎంపీ స్థానాలకు పోటీచేసే ఆయా పార్టీల అభ్యర్థులు..

పార్లమెంట్ స్థానం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
జహీరాబాద్	గాలి అనిల్ కుమార్	సురేశ్ షెట్కార్	బీబీ పాటిల్
మెదక్	పి.వెంకట్రామిరెడ్డి	? ? ?	రఘునందన్ రావు
కరీంనగర్	బోయినిపల్లి వినోద్‌కుమార్	? ? ?	బండి సంజయ్
భువనగిరి	క్యామ మల్లేశ్	? ? ?	బూర నర్సయ్య గౌడ్

ఖరారు కాని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు

మెదక్, కరీంనగర్, భువనగిరి స్థానాల్లో ఎవరిని బరిలో నిలపాలన్న దానిపై కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్‌ను మాత్రమే ప్రకటించింది. పార్టీలో బలమైన అభ్యర్థులు లేకపోవడంతో ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకొని తమ పార్టీ అభ్యర్థులుగా నిలబెట్టాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రెండు గ్రూపులుగా చీలిపోయి ఢిల్లీ కేంద్రంగా తమ మద్దతు దారులకు అనుకూలంగా లాబీయింగ్ చేస్తున్నారు. దీంతో పార్టీ అధిష్టానం ఎవరిని నిలపాలో తేల్చుకోలేక పోతున్నది. మెదక్ పార్లమెంట్ స్థానానికి రోజుకో పేరు తెరపైకి వస్తున్నది. ఇక్కడ బీఆర్ఎస్ బలంగా ఉంది. ఈ స్థానంలో బీఆర్ఎస్‌ను ఓడించడం అంత సులువు కాదని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చింది. దీంతో అభ్యర్థుల వేటలో పడింది. మెదక్ పార్లమెంట్ స్థానానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మలా జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నీలం మధుతో పాటు శ్రావణ్‌కుమార్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరికి తోడు ఓ పారిశ్రామిక వేత్త పేరుతో పాటు ఇతర పార్టీలోని ఓ నాయకుడిని పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్ పార్టీకి అంత సులువు కాదని సీఎం రేవంత్ రెడ్డితో సహా ఇతర నేతలకు తెలుసు. అందుకే బీఆర్ఎస్ నేతలను తమవైపు తిప్పుకోవడానికి అధికారాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. మెదక్ పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల్లో ఒక్క మెదక్ తప్ప అన్నిచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పణుకు పుడుతోంది. ఇక కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి కూడా ఇంత వరకు అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఇక్కడ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి పేరుతో పాటు మరికొంత మంది పేర్లు వినిపిస్తున్నాయి. భువనగిరి స్థానం నుంచి కోమటిరెడ్డి ఫ్యామిలి నుంచి పోటీ చేస్తారని వార్తలు వస్తున్నప్పటికీ, ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఇక బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. దీంతో వారు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కాగా, బీజేపీ అభ్యర్థులపై సొంత క్యాడర్ నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఏడుపాయల్లో పల్లకీసేవ

ఏడుపాయల్లో పల్లకి ఊరేగింపులో పాల్గొన్న ఆలయ చైర్మన్ బాలాగౌడ్, భక్తులు

పాపన్నపేట, మార్చి 24 : ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీమాత సన్నిధిలో ఆదివారం రాత్రి పౌర్ణమి పురస్కరించుకుని పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కుంకుమార్చనలు నిర్వహించారు. తలనీలాలు, బోనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్‌కుమార్, ప్రతాప్ రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, భత్తిని రాజు, శ్రీకాంత్ సేవలందించారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపన్నపేట ఎస్సై నరేశ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

న్యాల్‌కల్‌లో మాట్లాడుతున్న బీబీపాటిల్

న్యాల్‌కల్, మార్చి 24 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందని, 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ విమర్శించారు. ఆదివారం మండలంలోని న్యామతాబాద్ గ్రామ శివారులోని సన్‌రైజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 100 రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. పదేండ్లలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నరేంద్రమోడీ ఎంతో కృషిచేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తనను మరో సారి ఎంపీగా గెలిపిస్తే జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, పాండురంగారావు పాటిల్, మల్లప్పపాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దారెడి తదితరులు బీజేపీలో చేరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఓంకార్ యాదవ్, మల్లేశం, ఏక్‌నాథ్ పాటిల్, ఈరన్న, బస్వరాజ్ పాటిల్, విద్యాసాగర్ పాటిల్, దేశెట్టి పాటిల్, సుధీర్ బండారీ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

40 ఏండ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

మహ్మదాబాద్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నర్సాపూర్, మార్చి 24: మండలంలోని మహ్మదాబాద్‌లో నాలుగు దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకుని హోలీ సంబురాలు నిర్వహించుకున్నారు. 1984 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మహ్మదాబాద్‌లోని ఛత్రునాయక్ అగస్త్య ఫాంహౌస్‌లో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అనంతరం హోలీ సంబురాలు నిర్వహించుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఛత్రునాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మమ్మేలు మల్లన్న

మల్లన్న నామస్మరణతో మార్మోగిన కొమురవెల్లి క్షేత్రం

- ఆదివారానికి భారీగా భక్తుల రాక
- స్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- క్యూలైన్ నిలిపివేయడంతో భక్తులు అసహనం

కొమురవెల్లిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చేర్యాల, మార్చి 24: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. దీంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. బ్రహ్మోత్సవాల 10వ ఆదివారం 50వేల మంది భక్తులు వచ్చారు. ఉదయం నుంచే క్యూలో గంటల పాటు వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి, బోనాలు తీసి, ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మల్లన్న ఆశీస్సులు ఉండాలి: మంత్రి పొన్నం

ప్రజలందరిపై కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఉండాలని తాను స్వామి వారికి మొక్కినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులతో ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహామండపంలో పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి క్షేత్రంలోని గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మంత్రి మాట్లాడారు. ఎన్నికల ముందు స్వామిని దర్శించుకున్నానని, ఇప్పుడు కుటుంబ సభ్యులతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని మల్లన్నను వేడుకున్నట్లు తెలిపారు. మంత్రి వెంట మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, కమిటీ సభ్యులు, కొమురవెల్లి మండల గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి రూ.50వేల విరాళం

మల్లికార్జున స్వామి నిత్యాన్నదాన సత్రానికి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అలుగునూరుకు చెందిన ఈనుకొండ మల్లారెడ్డి, రాధ దంపతులు రూ.50,116 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి విరాళానికి సంబంధించిన రసీదును ఆ దంపతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

క్యూలైన్ల నిలిపివేతతో భక్తుల అసహనం

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్వామి వారి దర్శనానికి రావడంతో గంట పాటు దర్శనాల క్యూలైన్లు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఎండకాలం కావడంతో ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. అదే సమయంలో మంత్రి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో దర్శనానికి రావడంతో ఆలయ వర్గాలు క్యూలైన్లు నిలిపివేయడంతో క్యూలైన్లు, మహామండపంలో భక్తులు గంటకుపైగా వేచి ఉన్నారు.

పట్నం వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం దంపతులు

విరాళం అందజేస్తున్న మల్లారెడ్డిరాధ దంపతులు

నిజాంపేటలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కాంగ్రెస్ సర్కారు హామీలు నెరవేర్చాలి

- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

చేగుంట, మార్చి 24: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ సర్కారు నెరవేర్చాలని, హామీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద ఓ శుభ కార్యానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఎండిపోయిన పంటలు, వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను గుర్తించి బాధిత రైతులకు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం తథ్యం అన్నారు. మెదక్ స్థానంలో బీజేపీ జెండా ఎగురువేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ ఎంపీటీసీ బెదరబోయిన భాగ్యలక్ష్మీ నాగభూషణం పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే బలం.. బలగం

నిజాంపేట, మార్చి 24: బీజేపీకి కార్యకర్తలే బలం, బలగమని మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం చల్మెడలోని తిరుమలనాథ స్వామి, పెద్దమ్మ ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిజాంపేటలో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రఘునందన్‌రావు మాట్లాడారు. వందరోజుల పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 9వేల కోట్లు అప్పు చేశాడని, రైతు రుణమాఫీపై స్పష్టత కరువైందన్నారు. బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనా కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ విజయ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాస్, నార్లపూర్ ఎంపీటీసీ రాజిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్, రాజిరెడ్డి, తిరుపతి, సంజీవ్, రమేశ్, స్వామి ఉన్నారు.

బగలాముఖి శక్తిపీఠంలో పౌర్ణమి పూజలు

బగలాముఖి శక్తిపీఠంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శివ్వంపేట, మార్చి 24: మండల కేంద్రం శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో ఆదివారం శోభకృత్ నామ సంవత్సర చివరి పౌర్ణమి కావడంతో అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో వేదపండితులు హోమం, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, హరిద్రార్చన హవనం, పూర్ణాహుతి, మహామంత్రహవనం, మహాపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు జిన్నారం పెద్దగౌని లింగాగౌడ్, అంజమ్మ దంపతుల జ్ఞాపకార్థం హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు శాస్త్రుల పురుషోత్తం శర్మ, వెంకటరమణశర్మ, జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్, పబ్బ మహేశ్‌గుప్తా, పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయశర్మ, సంతోశ్‌కుమార్‌శర్మ, భరద్వాజ్‌శర్మ, వివేక్ శర్మ, పారిశ్రామికవేత్తలు చాగండ్ల బల్వీందర్, నందకుమార్, కామారెడ్డి శ్రీనివాస్, పోచగౌడ్, కొండల్, విశ్వశ్రీ లా చాంబర్ సిబ్బంది లికిత శ్రీనివాస్, చిన్న, ముద్దగాళ్ల రాజు, రమేశ్ గుప్తా, కిషన్, సత్యనారాయణ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.